క్లుప్తంగా

కోతకు గురైన రోడ్డు మార్జిన్



నందిగామ టౌన్: ఇటీవల కురిసిన వర్షాలు, వరదల కారణంగా మున్నేరుకు భారీగా వరద వచ్చి చేరింది. వరద దాటికి నందిగామ–మధిర రహదారి మార్జిన్ దాదాపు అర కిలోమీటరు కోతకు గురై ఐదారు అడుగుల మేర లోయలా మారి దర్శనమిస్తోంది. ఆంధ్ర, తెలంగాణాలను అనుసంధానం చేసే ప్రధాన రహదారి కావడంతో దీనిపై నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. మార్జిన్‌కు మరమ్మతులు నిర్వహించాల్సిన అధికారులు కేవలం సూచిక బోర్డులు పెట్టి చేతులు దులుపుకొంటున్నారని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మార్జిన్‌లను పూడ్చాలని కోరుతున్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



బూదవాడ(జగ్గయ్యపేట): గ్రామంలోని ముగ్గురు ఆశావర్కర్‌లకు బూచవరం ప్రభుత్వాస్పత్రి వైద్యులు మంగళవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి అనిల్‌కుమార్ మాట్లాడుతూ ఇటీవల గ్రామంలోని పాలేటి ఉపనది ఉధృతంగా ప్రవహించడంతో ముగ్గురు ఆశావర్కర్ల ఇళ్లలోకి వరదనీరు చేరి ఇళ్లు ధ్వంసమై నిరాశ్రయులయ్యారన్నారు. దీంతో ప్రభుత్వాస్పత్రి వైద్య సిబ్బంది సౌజన్యంతో మూడు కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందించామని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ వెంకట్రావ్, నాగలక్ష్మి, ఏఎన్ఎం వనజ తదితరులు పాల్గొన్నారు. ముందుగా గ్రామంలోని ఎస్సీ, ఎస్టీ కాలనీలో ఇంటింటి సర్వే చేసి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు.

ముంపు ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటన

చందర్లపాడు(నందిగామ టౌన్): వరద ముంపునకు గురై నష్టపోయిన ప్రతీ రైతును ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. చందర్లపాడు మండలంలోని తోటరావులపాడు, చింతలపాడు, ఏటూరు గ్రామాల్లో వరద ముంపునకు గురైన పంట పొలాలను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు అధైర్యపడొద్దని ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు, ఆయా గ్రామాల రైతులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాజ్‌వే పరిశీలన



లింగాల(వత్సవాయి): భారీ వరదల కారణంగా తీవ్రంగా దెబ్బతిన్న లింగాల కాజ్‌వేను మంగళవారం ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దెబ్బతిన్న కాజ్‌వేను రామ్‌కో వారి సౌజన్యంతో తాత్కాలిక మరమ్మతులు చేస్తున్నట్లు తెలిపారు. చిల్లకల్లు నుంచి వైరా వరకు రహదారి విస్తరణతో పాటు మునేటిపై నూతన బ్రిడ్జి కొరకు ప్రతిపాదనలు పంపించడం జరుగుతుందన్నారు. ఇప్పటికే ఆర్అండ్‌బీ అధికారులతో మాట్లాడినట్లు చెప్పారు. మరమ్మతుల అనంతరం మునేటి కాజ్‌వేపై రాకపోకలు జరుగుతాయని చెప్పారు. కార్యక్రమంలో మండల పార్టీల అధ్యక్షులు వడ్లమూడి రాంబాబు, కట్టా వెంకట నరసింహారావు, తొండపు జగన్‌మోహన్‌రావు, చావా నాగేశ్వరరావు, చిట్టూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న గృహాల వివరాలు నమోదు

జుజ్జూరు(వీరులపాడు): భారీ వర్షాలు, వరదలకు దెబ్బతిన్న గృహాల వివరాలు నమోదు చేయాలని తహసీల్దార్ రాజకిషోర్ పేర్కొన్నారు. మండలంలోని జుజ్జూరు గ్రామంలో తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 22 గ్రామ పంచాయతీల పరిధిలో వర్షాలు, వరదలకు దెబ్బతిన్న గృహాలను గుర్తించాలన్నారు. పాక్షికంగా, పూర్తిగా దెబ్బతిన్న గృహాల వివరాలను ఆయా గ్రామాల వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులకు తెలపాలన్నారు. దెబ్బతిన్న గృహాల నివేదికను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నష్టపరిహారం అందించడం జరుగుతుందని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు

భీమవరం(వత్సవాయి): రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడిన ఘటన మంగళవారం చిల్లకల్లు సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు పెనుగంచిప్రోలు గ్రామానికి చెందిన ఇస్లావతు కోటి స్కూటీపై జగ్గయ్యపేట వెళ్తున్నాడు. ఈ క్రమంలో కోటి రోడ్డుపై ఉన్న గుంతను తప్పించబోయి ఎదురుగా వస్తున్న ఆటోను ఢీ కొట్టాడు. ఈ ఘటనలో కోటి, ఆటోలో ఉన్న వల్లభదాసు ఏసు గాయపడ్డాడు. ఇరువురిని జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రికి తరలించగా ప్రథమచికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయవాడకు తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

కాలువలకు గండ్లు



అన్నవరంలో పాలేటి ఒడ్డున వరిపొలంలో బయటపడిన మట్టి, రాళ్లు



మునేరు ప్రధాన కాలువకు ముచ్చింతాల సమీపంలో పడిన గండి

పెనుగంచిప్రోలు/వత్సవాయి: తుఫాన్ ప్రభావంతో మునేరుకు వచ్చిన భారీ వరద కారణంగా పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాల పరిధిలో పలుచోట్ల గండ్లు పడ్డాయి. మునేరు ప్రధాన కాలువకు వత్సవాయి మండలం పోలంపల్లి వద్ద మునేరు పక్కనే ఒక గండితోపాటు మొత్తం ఏడు చోట్ల గండ్లు పడ్డాయి. అలాగే తువ్వకాలువకు రెండు మొత్తం 57 చోట్ల గండ్లు పడ్డాయి. వీటిని తక్షణం పూడ్చేందుకు సుమారు రూ. 2 కోట్లు ఖర్చు అవుతాయని ఇరిగేషన్ అధికారులు ప్రాథమిక అంచనా వేస్తున్నారు. గత ప్రభుత్వంలో గత ఏడాది జులై నెలలో వచ్చిన భారీ వరదలకు గండ్లు పడటంతో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి నాటి జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను తీసుకెళ్లి తక్షణం గండ్లు పూడ్పించారు. దీంతో రైతులు ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. ఇప్పుడు కూడా తక్షణం గండ్లు పూడ్పించాలని రైతులు కోరుతున్నారు.

జగ్గయ్యపేట: ఇటీవల కురిసిన వర్షాల కారణంగా పాలేటి నదీ పరివాహక ప్రాంత గ్రామాల్లో వందల ఎకరాల్లో ఇసుక మేటలు వేశాయి. వరి, పత్తి, మిర్చి పొలాల్లో ఇసుక మేటలు వేయడంతో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



గండి పడిన నవాబుపేట చెరువు



పెనుగంచిప్రోలు సమీపంలో తువ్వకాలువకు పడిన గండి



బూదవాడలో ఇసుక రీచ్‌ను తలపిస్తున్న వరి పొలం

ఉత్సాహంగా నవరాత్రి వేడుకలు

వత్సవాయి: గణపతి నవరాత్రి వేడుకలు గ్రామాల్లో ఉత్సాహంగా సాగుతున్నాయి. మంగళవారం కొన్ని గ్రామాల్లో గణనాథులను కృష్ణానదిలో నిమజ్జనం చేశారు. మరికొన్ని గ్రామాల్లో ఐదు రోజులు పూజల అనంతరం గురువారం, తొమ్మిది రోజులు పూజల తర్వాత నిమజ్జనాలు చేయనున్నారు. అలాగే గణేష్ మండపాల వద్ద స్వామివారి చేతిలో పెట్టిన లడ్డూలను వేలం పాటలు నిర్వహిస్తున్నారు.

నందిగామ టౌన్: పట్టణంలోని ప్రధాన కూడళ్లు, గ్రామాల్లో కొలువుదీరిన గణనాథులకు మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వాసవీ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన మండపం వద్ద నిమ్మపండ్ల అర్చన, అష్టోత్తర పుష్పార్చన పూజలు, సుబ్రహ్మణ్యస్వామికి హోమాద్రి క్రతువులను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అదేవిధంగా రైతుపేట, సీఎం రోడ్డు, నెహ్రూనగర్, పాత బస్టాండ్, మెయిన్ బజార్, కూరగాయల మార్కెట్, మార్కెట్ యార్డు, ముక్కోటి మహా మండపం తదితర ప్రాంతాల్లో కొలువుదీరిన వినాయకులకు పూజలు, అర్చనలు చేశారు. ముక్కోటి మహా మండపంలో కుర్‌కురే ప్యాకెట్‌లతో అలంకరించిన బొజ్జగణపయ్య చూపరులను ఆకట్టుకుంది. రైతుబజార్, చెరువు బజార్‌లోని వినాయక మండపాల వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాత్రికి పలు మండపాల్లోని గణనాథులను కీసర మున్నేటికి, వేదాద్రి కృష్ణానదికి నిమజ్జనానికి తరలించారు.



మంగొల్లు బీసీ కాలనీలో కొలువుదీరిన గణనాథుడు

జగ్గయ్యపేట అర్బన్: వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలో మంగళవారం పలు మండపాల్లో కొలువై ఉన్న గణనాథులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక వైవై కాలనీలో రాము ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మండపం, విశ్వబ్రాహ్మణ వీధిలో గణేష్ ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసిన మండపంలో పూజలు నిర్వహించారు. కాగా స్థానిక చెరువు బజారులో నీళ్ల ట్యాంకుల వద్ద కోటి ఫ్రెండ్స్ యూత్ వారు ఏర్పాటుచేసిన 28 అడుగుల గణేష్ విగ్రహం, కోదాడ రోడ్‌లోని మార్కెట్ యార్డు ఎదురుగా రాయల్ ఫ్రెండ్స్ యూత్‌వారు ప్రత్యేక అలంకరణతో ఏర్పాటుచేసిన 23 అడుగుల గణేష్ విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

పెనుగంచిప్రోలు: చవితి పందిళ్లలో ఏర్పాటు చేసిన గణనాథులకు భక్తులు విశేషంగా పూజలు చేస్తున్నారు. మంగళవారం పందిళ్లలో గణేష్ విగ్రహాలకు పూజలతోపాటు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో నవరాత్రుల వేడుకలు కొనసాగుతున్నాయి. కొన్ని విగ్రహాలను నిమజ్జనాలకు తరలించారు.



పెనుగంచిప్రోలు కాజ్‌వే పక్కన వేణుగోపాలస్వామివారి ఆలయంలో వినాయకుడు

కంచికచర్ల: స్థానిక హనుమాన్‌పేటలో కమిటీ సభ్యులు ఏర్పాటుచేసిన మండపంలోని వినాయకుడికి మంగళవారం భక్తులు సామూహిక పూజలు నిర్వహించారు. నరసింహారావుపాలెం ఆగస్త్య పీఠం సుగుణానంద స్వామి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. నీరాజన మంత్ర పుష్పములు, మహన్యాసపూర్వక అభిషేకాలు, అష్టోత్తర పూజలు చేశారు. అదేవిధంగా స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో వర్తక సంఘం ఏర్పాటు చేసిన గణనాథుడికి ప్రత్యేక పూజలు జరిగాయి. పెట్రోలు బంక్ సెంటర్, వసంతకాలనీ, ఇందిరా కాలనీ, మోడల్ కాలనీ, మండలంలోని కీసర, మోగులూరు, పరిటాల, కొత్తపేట, గనిఆత్కూరు, చెవిటికల్లు, గొట్టుముక్కల గండేపల్లి తదితర గ్రామాల్లో విశేషంగా పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.



నందిగామ వాసవీ మార్కెట్‌లో కొలువుదీరిన వినాయకుడు



ముక్కోటి మండపంలో కుర్‌కురే ప్యాకెట్‌లతో అలంకరించిన బొజ్జగణపయ్య



కంచికచర్ల హనుమాన్‌పేటలో వినాయకుడికి సామూహిక పూజలు

న్యాయవాదిపై దాడి హేయం

నందిగామ టౌన్: న్యాయవాదులపై భౌతిక దాడులకు పాల్పడటం హేయమైన చర్య అని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నండ్రు విద్యాసాగర్ పేర్కొన్నారు. బార్ అసోసియేషన్ సభ్యుడు, న్యాయవాది యరగాని వీరబాబుపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ మంగళవారం విధులను బహిష్కరించి కోర్టు ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గద్దె హనుమంతరావు, ఉపేంద్ర, సురేష్‌లు న్యాయవాది కుటుంబ సభ్యులను అసభ్య పదజాలంతో దూషించడంతోపాటు వీరబాబుపై దాడికి పాల్పడ్డారన్నారు. వారిపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సీఐ వైవీఎల్ నాయుడుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు కన్నెగంటి జీవరత్నం, ఎండీ అమీన్, దాదాహుసేన్, హనుమంతరావు, ప్రభాకరరావు, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

బ్రిక్స్ ఫ్యాక్టరీకి రూ. 2 కోట్ల నష్టం

జగ్గయ్యపేట అర్బన్: ఇటీవల సంభవించిన వరద ముంపునకు జగ్గయ్యపేట మండలం, బలుసుపాడు గ్రామంలో ఉన్న ఆరుష్ బిల్డింగ్ మెటీరియల్స్ ప్రైవేటు లిమిటెడ్(లైట్ వెయిట్ బ్రిక్స్ ఫ్యాక్టరీ)కు సుమారు రూ. 2 కోట్ల నష్టం వాటిల్లిందని ఫ్యాక్టరీ డైరెక్టర్ మర్రి జగన్నాథరావు తెలిపారు. ఈమేరకు మంగళవారం ఆయన ఫ్యాక్టరీ ప్రతినిధులతో కలిసి జగ్గయ్యపేట తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. పాలేటికి వచ్చిన వరద వల్ల ఫ్యాక్టరీలోకి 4, 5 అడుగుల మేర నీరు రావడంతో ఫ్యాక్టరీ మిషనరీ, ఎలక్ట్రికల్ ప్యానల్స్, అప్పటికే తయారీలో ఉన్న మెటీరియల్, రా–మెటీరియల్ స్టాక్, పూర్తయిన బ్రిక్స్ వరద నీటిలో మునిగిపోయి కొట్టుకుపోయాయని వినతిపత్రంలో తెలిపారు. కావున ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

ఖాళీ స్థలాలను శుభ్రం చేసుకోవాలి

జగ్గయ్యపేట అర్బన్: జనావాసాల మధ్య ఉన్న ఖాళీ స్థలాలను ఆయా స్థలాల యజమానులు పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ వైస్‌చైర్మన్ తుమ్మల ప్రభాకర్ సూచించారు. స్థానిక కాకానినగర్‌లో ఖాళీ స్థలాల్లో వరద నీరు చేరి మడుగులుగా మారాయి. దీంతో మురుగు వాసన రావడంతో పాటు దోమలు వృద్ధి చెంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. స్పందించిన మున్సిపల్ వైస్‌చైర్మన్ ప్రభాకర్ మంగళవారం కాకానినగర్‌లో పర్యటించి ఖాళీ స్థలాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నిలిచి ఉన్న మురుగు నీటితో విషజ్వరాలు వంటి సీజనల్ వ్యాధుల బారిన పడే ప్రమాదముందని, తక్షణమే మున్సిపల్ అధికారులు ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు పంపాలన్నారు. అలాగే మురుగు నీటిని మోటార్ల ద్వారా తోడివేయాలని సూచించారు.



కాకానినగర్‌లో ఖాళీ స్థలాల్లో నిలిచిన నీటిని పరిశీలిస్తున్న మున్సిపల్ వైస్‌చైర్మన్ ప్రభాకర్

వరద బాధితులను ఆదుకోవాలి

జగ్గయ్యపేట అర్బన్: వర్షాలు, వరదల వల్ల నష్టపోయిన బాధితులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని సీపీఎం పట్టణ, మండల కార్యదర్శి సోమోజు నాగమణి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద మండల సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. నాగమణి మాట్లాడుతూ బాధితులకు ఆస్తి, పంట నష్టాలను అంచనా వేసి నష్టపరిహారం అందజేయాలని కోరారు. పార్టీ నాయకులు కాకనబోయిన లింగారావు, కోట కృష్ణ, దంతాల వెంకటేశ్వర్లు, కోట రవికుమార్, గౌస్‌మియా, రాంప్రసాద్, షేక్ బడేమియా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వనాథ సత్యనారాయణ జయంతి



జగ్గయ్యపేట అర్బన్: కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ 130వ జయంతిని స్థానిక జీవీజే జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం. అనంతుల మాధవీలత అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కోదాడ పట్టణానికి చెందిన ప్రముఖ కవి, పండితుడు శ్రీరామ కవచం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మాధవీలత మాట్లాడుతూ జ్ఞానపీఠ అవార్డు గ్రహీత విశ్వనాథ సత్యనారాయణ మన ప్రాంత వాసి కావడం గర్వకారణమన్నారు. వారు రచించిన వేయిపడగలు, రామాయణ కల్పవృక్షం, కిన్నెరసాని పాటలు వంటివి ఎంతో ప్రజాదరణ పొందాయని కొనియాడారు. కవి శ్రీరామ కవచం మాట్లాడుతూ నేటి యువత విశ్వనాథుని రచనలు చదవడం అలవాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం కవి శ్రీరామను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సాహిత్యాభిలాషులు సుశర్మ, అబ్బాస్ అలీ, కవి సరికొండ నరసింహారాజు, పాఠశాల తెలుగు భాషా పండితులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దాడులకు పాల్పడితే సహించేది లేదు

మాజీ ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులకు పాల్పడితే సహించేది లేదని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహనరావు అన్నారు. టీడీపీ మూకల దాడిలో గాయపడిన వీరులపాడు మండలం గోకరాజుపల్లి గ్రామానికి చెందిన మేచర్ల రేణుకకు వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మంజూరు చేసిన రూ. 50 వేల చెక్కును స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 22న టీడీపీ నాయకుల దాడిలో గ్రామంలోని ఎస్టీ కాలనీకి చెందిన రేణుకకు గాయాలయ్యాయన్నారు. దీంతో పార్టీ నుంచి బాధిత కుటుంబానికి ఆర్థిక సహకారం అందించామని తెలిపారు. నాయకులు, కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు కృష్ణయ్య, వెంకటేశ్వరరావు, బాలసాని మోహనరావు తదితరులు పాల్గొన్నారు.



రేణుకకు చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీలు ధ్వంసం

నందిగామ టౌన్: నందిగామ పట్టణంలోని పలు ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీలను గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం రాత్రి ధ్వంసం చేశారు. ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ జన్మదిన సందర్భంగా ఈ నెల రెండున పట్టణంలోని రైతుపేట, గాంధీసెంటర్, సీఎం రోడ్డు, మెయిన్ బజార్, మున్సిపల్ కార్యాలయం సమీపంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. కాగా ఫ్లెక్సీలను రాత్రికి రాత్రే ధ్వంసం చేయడంపై పార్టీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.



పట్టణంలో ధ్వంసమైన వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీలు

ఫ్లెక్సీలు ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

నందిగామ టౌన్: పట్టణంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సీఐ వైవీఎల్ నాయుడుకు మంగళవారం ఆ పార్టీ నేతలు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ జన్మదినం సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలుపుతూ పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను కొంత మంది రాత్రికి రాత్రే ధ్వంసం చేశారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వంలో ఫ్లెక్సీలు, అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాలు ధ్వంసం చేయడం హేయమని ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్లెక్సీలు ధ్వంసం చేసిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని సీఐని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఓర్సు లక్ష్మి, వైస్ చైర్మన్ పాకాలపాటి కిరణ్, నాయకులు మహ్మద్ మస్తాన్, పాములపాటి రమేష్, ఓర్సు జ్వాలా, బండారు శేషు, తోట అంజారావు, మువ్వల శ్రీను, సూరె రామారావు, షేక్ జాఫర్, షేక్ యాకుబ్ అలీ, బండారు వెంకట్రావ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఫ్లెక్సీల విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ రమణబాబును కోరారు.



సీఐ వైవీఎల్ నాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మాదక ద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన

కంచికచర్ల: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ బి. సత్యనారాయణ సూచించారు. కంచికచర్ల దీక్షా డిగ్రీ కళాశాలలో మంగళవారం మాదక ద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ యువత దేశానికి పనికొచ్చే విధంగా నడుచుకోవాలని, దేశరక్షణ కోసం పాటుపడాలని అన్నారు. డ్రగ్ ఎబ్యూజ్ లేని సమాజాన్ని స్థాపించడంతోపాటు ప్రతి ఒక్కరికీ వాటి వల్ల జరిగే నష్టాన్ని తెలియజేయాలని సూచించారు. మాదక ద్రవ్యాలను అరికడదామని, బంగారు భవిష్యత్‌కు పునాది వేసుకుందామని పేర్కొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఈబీ సీఐ సత్యనారాయణ

కార్యక్రమంలో ఎస్ఐలు ఎన్ కళ్యాణి, వై. నాగేంద్రకృష్ణ, కళాశాల ప్రిన్సిపాల్ జగదీష్, వైస్ ప్రిన్సిపాల్ కేవీ త్రినాథ్, వెంకట్, ధనలక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పంట పొలాల పరిశీలన

కంచికచర్ల: మండలంలో కృష్ణానది వరద ప్రభావిత గ్రామాలైన పరిటాల, కొత్తపేట, గనిఆత్కూరు, బత్తినపాడు, చెవిటికల్లు గ్రామాల్లోని పంట పొలాలను మంగళవారం శాస్త్రవేత్తల బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా వారు రైతులకు పలు సూచనలు, సలహాలు చేశారు. వరి పూర్తిగా కుళ్లిపోయిందని ప్రత్యామ్నాయ పంటలు సాగుచేసుకోవాలని సూచించారు. వరదల వల్ల దెబ్బతిన్న మొక్కజొన్న, పత్తి, మిర్చి పంటలను తొలగించి రబీ పంటగా శెనగను సాగు చేసుకోవాలని చెప్పారు. వరి పొలంలో ఎకరానికి 20కేజీల యూరియా, 20కేజీల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ పైపాటుగా వేయడం వల్ల పంట త్వరగా పుంజుకుంటుందని తెలిపారు. పత్తి పంటలో ఎండగా ఉన్న సమయంలో 1.2శాతం పొటాషియం నైట్రేట్ ద్రావణాన్ని వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ బీ ఆశాజ్యోతి, సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ విజయభాస్కరరెడ్డి, ఉయ్యూరు చెరుకు పరిశోధన కేంద్రం డాక్టర్ జే శైలజారాణి, మండలవ్యవసాయ అధికారి కే విజయకుమార్ పాల్గొన్నారు.



బత్తినపాడులో దెబ్బతిన్న మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

రైతులను తక్షణమే ఆదుకోవాలి

వీరులపాడు: మండలంలోని వీరులపాడు, దొడ్డదేవరపాడు గ్రామాల్లో నీట మునిగిన పంట పొలాలను రైతు, కౌలురైతు సంఘం నాయకులు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కౌలురైతు సంఘం మండల కార్యదర్శి చాట్ల రవి మాట్లాడుతూ వరదలతో రైతులు పంట నష్టపోయి అవస్థలు పడుతుంటే ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందన్నారు. రైతులను తక్షణమే ఆదుకోవాలని లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రైతు సంఘం నాయకులు పల్లెకంటి బాబు, హరిబండ్ల నాగయ్య, సరిమళ్ల పుల్లయ్య, వెంకటప్పయ్య, పలువురు రైతులు పాల్గొన్నారు.

గల్లంతైన వ్యక్తి కోసం గాలింపు

నందిగామ టౌన్: పందెం కాసి మున్నేటిలో దూకి గల్లంతైన మాడుగుల గోపి(చంటి) ఆచూకీ మంగళవారం కూడా లభ్యం కాలేదు. సోమవారం సాయంత్రం గల్లంతవగా రెవెన్యూ, పోలీస్ అధికారులు గాలించినా ఫలితం లేకపోవడంతో ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. దీంతో రంగంలోకి దిగిన ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది ముమ్మరంగా గాలించారు. పల్లగిరి సమీపంలోని మున్నేటితో పాటు కీసర వద్ద కూడా రెండు బృందాలుగా మంగళవారం రాత్రి వరకు గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. పల్లగిరి వద్ద తహసీల్దార్ సురేష్‌బాబు, కీసర వద్ద సీఐ వైవీఎల్ నాయుడు గాలింపు ప్రక్రియను పర్యవేక్షించారు.